## ఒకే ఒక్క వినతి ..



విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒకే ఒక్క వినతి వచ్చింది. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి వచ్చిన వినతిని కమిషనర్ పల్లి నల్లనయ్య స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒక వినతి వచ్చిందన్నారు. సమస్య పరిష్కారానికి సంబంధిత విభాగ అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీప్లానర్ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం

## ఔదార్యం..



నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. లెప్రసీ వలన అంగవైకల్యం సంభవించిన బాధితుల సహాయార్థం తమ ఉపాధ్యాయుల సహకారంతో 17,068 రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని ప్రధానోపాధ్యాయుడు జ్ఞానశంకర్ సమక్షంలో లెప్రసీ సొసైటీ ప్రతినిధి లెంక రమణకు సోమవారం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. – నెల్లిమర్ల రూరల్

## ధగధగలు..



విజయనగరం జిల్లా కేంద్రంలోని చారిత్రాత్మక గంటస్తంభం విద్యుత్ కాంతులతో కాంతులీనుతోంది. సంక్రాంతి పండగ నేపథ్యంలో గంటస్తంభాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఇదిలా ఉంటే పండగ నేపథ్యంలో వస్త్ర దుకాణాలు, కిరాణా దుకాణాలు వినియోగదారులతో కళకళలాడుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

## క్లుప్తంగా

### అన్న క్యాంటీన్ల వద్ద క్యూఆర్ కోడ్ విధానం



అన్న క్యాంటీన్ వద్ద డ్రైనేజీ విధానాన్ని పరిశీలిస్తున్న డీఈఈ శ్రీనివాసరావు

విజయనగరం: అన్న క్యాంటీన్ల నిర్వహణ, విధివిధానాలపై ప్రజాభిప్రాయం సేకరించే నిమిత్తం అన్ని అన్నక్యాంటీన్ల వద్ద క్యూఆర్ కోడ్ విధానాన్ని ఏర్పాటు చేసినట్లు కార్పొరేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు తెలిపారు. అన్న క్యాంటీన్‌లకు వెళ్లే ప్రజలు ఆహార పదార్థాలు, పారిశుధ్యం, ఇతర అంశాలపై తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియపరచవచ్చని చెప్పారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్ వద్ద డ్రైనేజీ విధానాన్ని సోమవారం ఆయన పరిశీలించారు.

### పీఎం సభను విజయవంతం చేయండి..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: ఈనెల 8న విశాఖలోని జరగనున్న దేశ ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేసేలా కూటమి కార్యకర్తలు కదలి రావాలని స్థానిక శాసన సభ్యురాలు పూసపాటి అదితిగజపతిరాజు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక అశోక్ బంగ్లాలో నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విశాఖలోని రైల్వేజోన్, మెట్రోజోన్, ఫార్మాసిటీ ప్రాజెక్ట్‌లకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని, బొద్దల నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు

### పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

● దల్లిపేట సర్పంచ్ దల్లి కాంత



ఎంపీడీఓ కిశోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ దల్లి కాంత

భోగాపురం: ఏపీ పంచాయతీరాజ్ చట్టం 1994 ద్వారా పంచాయతీలకు, సర్పంచ్‌లకు కేటాయించిన అధికారాలను ఉల్లంఘిస్తున్న పంచాయతీ కార్యదర్శి మహ్మద్ రిజ్వాన్‌పై చర్యలు తీసుకోవాలని దల్లిపేట సర్పంచ్ దల్లి కాంత కోరారు. ఈమేరకు ఎంపీడీఓ కిశోర్‌కుమార్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయతీ సర్పంచ్ దృష్టికి తీసుకురాకుండా పలు అభివృద్ధి పనులకు కార్యదర్శే అన్నీ తానై తీర్మానాలు చేస్తున్నట్లు చెప్పారు. ఆ పనులన్నీ తన స్వలాభం కోసమే చేపడుతున్నట్లు ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్న కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.


### సమస్యలను పరిష్కరించండి..



రైతుల సమస్యలను వివరిస్తున్న గ్రామపెద్ద శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: గ్రామ స్థాయిలో జరిగిన పురోణీ లేఖల సమస్యలను పరిష్కరించాలని మధుపాడ గ్రామానికి చెందిన నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని మధుపాడలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నల్లం అప్పారావు, గ్రామపెద్ద శ్రీనివాసరావు రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. తహసీల్దార్ సుదర్శనరావు మాట్లాడుతూ.. పురోణీల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### అభినందనలు..



ప్రొఫెసర్లను సత్కరిస్తున్న శంకరరావు

విజయనగరం అర్బన్: క్రమశిక్షణతో కూడిన జీవితం ఉన్నత శిఖరాలకు బాటలు వేస్తుందని ప్రముఖ వైద్యుడు, ప్రొఫెసర్ ఆనందరాజు, ప్రొఫెసర్ జయకుమారి అన్నారు. ఒకప్పటి తమ విద్యార్థి.. తర్వాత కాలంలో తమ సహచర్యంలో పనిచేసే సహోద్యోగి, నేడు ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఎదిగిన డాక్టర్ డీవీజీ శంకరరావును సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఆనందరాజు, ప్రొఫెసర్ జయకుమారిలను డాక్టర్ శంకరరావు సత్కరించారు.

# మంచి వ్యక్తిని ఎన్నుకోండి..



ఏపీపీయూఎస్‌హెచ్‌ఏ ప్రతినిధులతో ఎమ్మెల్సీ అభ్యర్థి సుంకర శ్రీనివాసరావు

● రాయలసీమ జిల్లాల ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి

విజయనగరం అర్బన్: ప్రభుత్వం, ఉపాధ్యాయులకు మధ్య వారధిగా పనిచేయగల మంచి వ్యక్తిని ఎమ్మెల్సీగా ఎన్నుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (ఏపీపీయూఎస్‌హెచ్‌ఏ) రాష్ట్ర ప్రతినిధి, రాయలసీమ జిల్లాల శాసనమండలి సభ్యుడు ఎంవీ రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సన్ స్కూల్‌లో జరిగిన ఏపీపీయూఎస్‌హెచ్‌ఏ సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘం మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ సుంకర శ్రీనివాసరావును సభ్యులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాభివృద్ధిలో ప్రైవేట్ విద్యాసంస్థలు కీలపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో శాసన మండలిలో శ్రీనివాసరావు లాంటి అనుభవం ఉన్న వ్యక్తుల అవసరం ఉందన్నారు. ఉత్తరాంధ్ర నుంచి ఎమ్మెల్సీ బరిలో ఉన్న శ్రీనివాసరావుకు దాదాపు 27 ప్రైవేట్, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాల మద్దతు ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయనకు తొలిప్రాధాన్యం ఓటు వేయాలని కోరారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపీపీయూఎస్‌హెచ్‌ఏ ప్రతినిధులు తులసీప్రసాద్, కేవీ కృష్ణారెడ్డి, ఎం.సత్యనారాయణ, డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, సీహెచ్.వి.రమేష్, ఎస్‌వీ లక్ష్మి, రవితేజ, అనిల్‌కుమార్, గీతాంజలి శ్రీనివాసరావు, మధు, పల్లవి శేఖర్, శ్రీనివాస్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి సాగు లాభదాయకం..



కూరగాయల స్టాల్ వద్ద వెలుగు అధికారులు, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు, కొనుగోలుదారులు

● వెలుగు ఏపీఎం శ్రీనివాస్

డెంకాడ: ప్రకృతి సాగు విధానంలో పంటలు పండించడం ఎంతో లాభదాయకమని, దిగుబడులు కూడా ఆరోగ్యకరంగా ఉంటాయని వెలుగు ఏపీఎం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని డెంకాడ, అమకాం గ్రామాల్లో ప్రకృతి సాగులో పండించిన కూరగాయల స్టాల్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఓం శ్రీనివాస్, ఎఫ్‌పీజీ ఏపీఎం గురుమూర్తి మాట్లాడుతూ.. రసాయన ఎరువులు, పురుగు మందులను వినియోగించి పంటలు సాగు చేయడం వల్ల పంటలు కలుషితమవుతాయన్నారు. సేంద్రియ ఎరువులు వినియోగించడం వల్ల ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తాయని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు ప్రతి సోమవారం వెలుగు కార్యాలయం వద్ద దిగుబడులు విక్రయిస్తారని, ఈ స్టాళ్లను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ డెంకాడ, అమకాం యూనిట్ ఇన్‌చార్జ్‌లు బి.సుజాత, పి.ధనలక్ష్మి, సీసీ సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# మార్పు బాలకృష్ణమ్మ సేవలు మరువలేనివి..



మార్పు బాలకృష్ణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

● ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శ ధనుంజయరావు

డెంకాడ: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేసిన దివంగత మార్పు బాలకృష్ణమ్మ సేవలు మరువలేనివని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.ధనుంజయరావు అన్నారు. మండలంలోని మోదవలసలో గల అయిస్టర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మార్పు బాలకృష్ణమ్మ 12వ వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధనుంజయరావు మాట్లాడుతూ.. మార్పు బాలకృష్ణమ్మ 1974 నుంచి 1985 వరకూ 11 సంవత్సరాలు శాసనమండలి సభ్యుడిగా పని చేశారన్నారు. ఈ కాలంలో ప్రొగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్‌కి నాయకుడి ఉంటూ శాసనమండలిలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేశారన్నారు. అలాగే ఏపీటీఎఫ్‌లో వివిధ హోదాల్లో పని చేశారన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వి.అప్పలరాజు, సీహెచ్ రాము, గోపాలకృష్ణంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నివాళులు..



విజయనగరం అర్బన్: బాలకృష్ణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

విజయనగరం అర్బన్: విద్య, ఉపాధ్యాయ రంగాల ఉద్యమ నేత మార్పు బాలకృష్ణమ్మ 12వ వర్ధంతి స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ కార్యాయలంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌బీ పైడిరాజు, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ ఆర్. కృష్ణ, జిల్లా సహాధ్యక్షురాలు శ్రీదేవి, ఉపాధ్యక్షులు సీహెచ్‌బీఎస్‌ఎల్ మూర్తి, జిల్లా కార్యదర్శి అప్పలరాజు, పీడీ నాయుడు, శరత్‌కుమార్, చిన్న సత్యనారాయణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ పైడితల్లి, ఎం.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

### దేశ సమైక్యతను కాపాడుకుంటాం.

● సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు




మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు

విజయనగరం ఫూల్‌బాగ్: మత సామరస్యాన్ని, దేశ సమైక్యతను కాపాడుకుంటాని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు అన్నారు. మసీదులపై దాడులు, దేవాలయాల కబ్జాకు ప్రయత్నిస్తున్న మతోన్మాదుల ప్రయత్నాలను తిప్పి కొట్టేందుకు, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక కోట జంక్షన్ నుంచి డెంకాశావళి బాబా మసీదు మీదుగా గురజాడ ఇంటి వరకు సీపీఎం ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతోన్మాదుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు పి. రమణమ్మ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

### పరామర్శ..

చీపురుపల్లి: మండలంలోని ఆర్థివలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ముల్ల ఈశ్వరరావు ఇటీవల మృతి చెందారు.జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సోమవారం ఆర్థివలస గ్రామా నికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడు ఈశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.కుటుంబ సభ్యులంతా ఆత్మస్థైర్యంతో ఉండాలని, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, గవిడి సురేష్, కోరుకొండ దాల య్య, రేవల్ల సత్తిబాబు తదితరులు ఉన్నారు.

### వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలభాస్కర రావు సోమవారం సందర్శించారు. రికా ర్డులు, విద్యార్థుల వర్క్‌బుక్‌లు, మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. చదువు లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, టీఎంఎల్ చార్టుల ద్వారా సులభంగా అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

### క్షయపై అవగాహన

వేపాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది క్షయ వ్యాధిపై సోమవారం అవగాహన కల్పించారు. క్షయ లక్షణాలు, వ్యాధి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీహెచ్ఓ అంజనేయులు వివరించారు. గ్రామాల్లో బంధువులు, స్నేహితులు, గ్రామస్తుల్లో ఎవరికైనా దగ్గు, కఫం, జ్వరం, బరువు తగ్గిపోవ డం, ఆకలి మందగించడం, ఆయాసం, కఫంలో రక్తపు జీరలు పడడం వంటి లక్షణాలు ఉంటే వారిని తక్షణమే సమీప పీహెచ్‌సీ లో టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోమని సూచించాలని చె ప్పారు. క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయమవుతుందన్నారు. ప్రిన్సిపాల్ అప్పారావు, హెల్త్ సూపర్‌వైజర్ రమణ, హెచ్‌ఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

### రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

వేపాడ: భూసమస్యల పరిష్కారానికి గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జె.రాములమ్మ సూచించారు. మండలంలోని నీలకం ఠరాజపురం, జమ్మాదేవిపేట గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ముందుగా గ్రామాల్లో అవగాహన ర్యాలీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభల్లో రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.సర్పంచ్ దేవి, ఉప తహసీల్దార్ సన్యాసినాయుడు, ఆర్ఐ రామలక్ష్మి, గ్రామపెద్దలు జగ్గుబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు తుది జాబితా విడుదల



ఓటరు జాబితా విడుదల చేస్తున్న అధికారులు

నెల్లిమర్ల: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను ఎన్నికల డీటీ వీవీఆర్ జగన్నాథరావు సోమవారం ప్రదర్శించారు. తహసీల్దార్ సుదర్శనరావు ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలోని నోటీస్‌బోర్డులో జాబితా వేలాడదీసినట్లు డీటీ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాలరావు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ ప్రసన్నకుమార్, ఆపరేటర్లు మహేష్, భాస్కర్ పాల్గొన్నారు.

# కాలువ నిర్మాణానికి చర్యలు



కాలువ నిర్మాణానికి అంచనాలు రూపొందిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

విజయనగరం: నగరంలోని బుచ్చన్న కోనేరు వద్ద కాలువ నిర్మాణానికి కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇటీవల జరిగిన వార్డు పర్యటనలో కోనేరు ప్రాంతంలో కాలువ లేకపోవడంతో అక్కడి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయంటూ స్థానిక కార్పొరేటర్ కంటుభుక్త తవిటరాజు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఇంజినీరింగ్ అధికారులు స్పందిస్తూ సోమవారం ఆ ప్రాంతంలో పర్యటించి సమస్య పరిష్కారానికి అవసరమైన కార్యాచరణ సిద్ధం చేశారు. సుమారు రూ.3.30 లక్షలతో కాలువ నిర్మాణానికి అంచనాలు రూపొందించారు. నివేదికను కమిషనర్‌కు ప్రతిపాదించిన అనంతరం పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# డిస్పెన్సరీ ద్వారా మెరుగైన వైద్య సేవలు



డిస్పెన్సరీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

నెల్లిమర్ల: ఈఎస్ఐ డిస్పెన్సరీ ద్వారా కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జూట్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఈఎస్ఐ డిస్పెన్సరీ వద్ద అన్ని రంగాల కార్మికులతో ధర్నా నిర్వహించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో డిస్పెన్సరీలో మందులు లేవని చెబుతూ కార్మికులను వెనక్కి పంపుతున్నారని తెలిపారు. దీంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అంతేకాకుండా కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించడానికి పనిముట్లు కూడా లేవన్నారు. కార్మికులకు మెరుగైన సేవలందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కార్మికులు కొండల కరువులు, పతివాడ లక్ష్మణరావు, పతివాడ సన్యాసినాయుడు, మీసాల లెనిన్, పతివాడ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉండాలి..

● డీఎంహెచ్ఓ జీవన్‌రాణి




డాక్టర్‌తో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ జీవన్‌రాణి

విజయనగరం రూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్య సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి జీవన్‌రాణి ఆదేశించారు. మండలంలోని రాకోడు పీహెచ్‌సీని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో అందుతున్న సేవలపై ఆరా తీశారు. అంటువ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఆస్పత్రుల్లో ప్రసవాలు జరుపుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఉండే భారత్ ఆయుష్మాన్ కేంద్రాలలో సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. వైద్యసేవలపై ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.పర్యవేక్షణలో ఆమెతో పాటు డాక్టర్ శ్రావణి, ఆశా, ఏఎన్ఎంలు ఉన్నారు

# జాబ్‌మేళాలో 21 మంది ఎంపిక



శృంగవరపుకోట: జాబ్‌మేళాకు హాజరైన యువతను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు



చీపురుపల్లిరూరల్(గరివిడి): ఇంటర్వ్యూ చేస్తున్న నెక్సో ఏఐ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ), ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. జాబ్‌మేళాలకు 47 మంది నిరుద్యోగ యువకులు హాజరు కాగా ప్రిన్సిపాల్ డాక్టర్ కేశవరావు నేతృత్వంలో వివిధ కంపెనీల ప్రతినిధులు వారికి ఇంటర్వ్యూలు చేశారు. హెటిరో డ్రగ్స్ కంపెనీకి ఏడుగురు, సేఫ్ డ్రైవ్ ప్లస్ కంపెనీకి పది మంది, విశ్వముద్ర ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి నలుగురు ఎంపికయ్యారని జేకేసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఈరన్న తెలిపారు. డీపీఓ భాస్కరరావు, ఎస్ఈఈడీపీ పి.లలిత, వైస్ ప్రిన్సిపాల్ కె.వాసుదేవరావు, అధ్యాపకులు సీహెచ్.శ్రీనివాసరావు, డాక్టర్ ఆర్.శ్రీలక్ష్మి, డి.లక్ష్మణ్, కె. అప్పలరాజు, డి.హైమావతి, డి.రామకృష్ణ, శివకుమార్, కె.భాస్కరరావు పాల్గొన్నారు.